క్లుప్తంగా

నగరపాలక సంస్థలో కారుణ్య నియామకాలు



ఉత్తర్వులను అందజేస్తున్న మేయర్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలిచ్చారు.ఈ మేరకు బుధవారం రాత్రి 8 మంది కుటుంబ సభ్యులకు మేయర్ సురేష్ బాబు చేతుల మీదుగా ఉత్తర్వులు ఇచ్చారు. యూనియన్ నాయకులు సుంకరి రవి పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మాసాపేట మాచుపల్లి బస్టాండు వద్ద రక్షణ సంస్థ అధ్యక్షుడు పి. సంపత్‌కుమార్, సీజేపీ అధ్యక్షుడు అశ్వర్థ్‌రెడ్డి, చైతన్య ఆధ్వర్యంలో కంప్యూటర్ ప్రాథమిక అంశాలపై ఉచిత శిక్షణ కార్యాలయంను వైఎస్సార్‌సీపీ నాయకులు సొహైల్, సీఎస్‌పీ సుబ్రమణ్యం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నగర మహిళా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, జాషువా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రూరల్, అర్బన్ పరిధిలోని అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సునంద తెలిపారు. ఖాళీల వివరాలు సమీపంలోని సీడీపీఓ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని.. ఆసక్తి ఉన్నవారు ఈనెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 11వ తేది ఉదయం 11.00 గంటలకు కడప రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని ఉక్కు కళావేదికలో జరిగిన 66 వ ఏపీ స్టేట్ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2023 పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించారు. అండర్-17 బాలుర విభాగంలో జిల్లాకు చెందిన కూర్మనాథ్ ప్రతిభ చూపాడు. అలాగే టీమ్ చాంపియన్‌షిప్‌లో కడప బాలికల, బాలుర జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. విజేతలకు గురువారం బహుమతి ప్రదానం చేశారు.

దైవానికి, మానవాళికి మధ్యవర్తి మరియు తల్లి

- పాదర్ ఎండీ ప్రసాద్‌రావు
- ఘనంగా పతాకావిష్కరణ
- ప్రారంభమైన లూర్దుమాత ఉత్సవాలు



దైవ సందేశం అందజేస్తున్న గురువులు



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

కడప కల్చరల్ : లూర్దుమాత దేవునికి, మానవాళికి మధ్యవర్తిగా ఉన్నారని సదుం విచారణ గురువులు ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు అన్నారు. లూర్దుమాత ఉత్సవాలను కడప నగరానికి చెందిన మరియాపురం డీన్ పెండ్లికట్ల అబ్రహం పతాకావిష్కరణ చేసి శాంతి కపోతాలను ఎగరవేసి ప్రారంభించారు. తొలిరోజు ఆయన దివ్య బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు తన సందేశంలో శక పురుషుడైన క్రీస్తు ప్రభువును ఈ లోకానికి తెచ్చేందుకు మరియమాత మధ్యవర్తిగా ఉండిందని, ఎప్పుడూ మనలను క్రీస్తు చెంతకు రమ్మని ఆహ్వానిస్తోందన్నారు. చీకటితో నిండిన లోకంలో మనుషులందరినీ పవిత్రులుగా, పరిశుద్ధులుగా చేసేందుకు అటు దేవునికి, ఇటు మానవాళికి ఆమె మధ్యవర్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఆమె అందరికీ తల్లి అని, ఒకరిని కూడా చేయి విడువక ఎల్లవేళలా తోడై సకల అపాయాల నుంచి కాపాడిన తల్లి అని తెలిపారు. పూజ ప్రారంభ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై లూర్దుమాత ప్రతిమను ఉంచి మరియాపురం పురవీధుల గుండా పరిశుద్ధ గీతాలాపనలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు జపం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. క్రీస్తు జ్యోతి సిస్టర్స్, సెయింట్ జోసెఫ్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు వేదికను అలంకరించారు. క్యాథడ్రల్ గాయక బృందం భక్తి గీతాలను ఆలపించారు. విచారణ గురువులు బిరుసు రాజా, కైపు చంద్ర, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాధి జోసెఫ్, ఉపాధ్యక్షులు పుల్లగుజ్జు విజయ్‌కుమార్, కార్యదర్శి పుల్లగూర లూర్దు, కోశాధికారి ఉప్పలపాటి విజయభాస్కర్, సంయుక్త కార్యదర్శి యన్నం ఆనంద్, ఈసీ సభ్యులు ఎండీ ఆల్ఫోన్స్, నందిమండలం విజయరాజు, అల్లూరి జోజప్ప, పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం



శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ఎస్ఎస్ఏ సెక్టోరియల్ కేశవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అని సమగ్రశిక్ష జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ మిట్టా కేశవరెడ్డి, కడప ఎంఈఓ పాలెం నారాయణ పేర్కొన్నారు. కడపలోని డీసీఈబీలో గురువారం స్కూల్ విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కడప, సీకేదిన్నె, చెన్నూరు, పెండ్లిమర్రి, వల్లూరు, సిద్దవటం మండలాలకు చెందిన పలువురు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు డేటాల్ హైజీన్ ఎడ్యుకేషన్‌లో భాగంగా సార్వ్ గ్రామాలయ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమగ్రశిక్ష జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ మిట్టా కేశవరెడ్డి, కడప ఎంఈఓ పాలెం నారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బాల్యం నుంచే పిల్లలకు పరిశుభ్రత అలవాట్లను కచ్చితంగా నేర్పించాలన్నారు. డెటాల్ బనేగా స్వస్థ ఇండియా(డిబిఎస్ఐ) స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ కుమారి, జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ విష్ణువర్ధన్, నెల్లూరు, ప్రకారం కో-ఆర్డినేటర్స్ జాకీర్, లక్ష్మి పాల్గొన్నారు.

కోదండరామాలయ వార్షిక వైభవం

- 8 నుంచి 11వ తేది వరకు విభిన్న ధార్మిక కార్యక్రమాలు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయం ఆలయ 23వ వార్షికోత్సవాలను ఈనెల 8 నుంచి 11వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలలో మహిళలు, బాలల భాగస్వామ్యం పెంచేందుకు వినూత్న రీతిలో ధార్మిక కార్యక్రమాలను రూపొందించారు. ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7.00 గంటల వరకు పూజోత్సవాలు నిర్వహిస్తారు. 8వ తేదీన 8,9,10వ తరగతి విద్యార్థులకు రామాయణ, భారత, భాగవతాలు, ఇతర ధార్మిక అంశాలపై క్విజ్ పోటీ, అదే రోజు మధ్యాహ్నం ధార్మిక ధారణ పోటీ, రాత్రి నృత్యప్రదర్శనలు ఉంటాయి. 9న ఉదయం భక్తులకు పురాణాలలో క్విజ్ పోటీ, మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీ, సాయంత్రం 6.30 గంటలకు సినీ భక్తి సంగీత పోటీలు నిర్వహిస్తారు. 10వ తేదీ ఉదయం బాలబాలికలకు ఆధ్యాత్మిక పాత్రధారణ పోటీలు, మధ్యాహ్నం మహిళలకు సరదా ఆటల పోటీలు ఉంటాయి. 11న ఉదయం 7.30 గంటలకు ఏకాదశ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహిస్తారు. విద్యార్థుల ధార్మిక పోటీలకు సంబంధించి 98494 89206, స్త్రీ, పురుషుల ధార్మిక పోటీలకు 98663 48518, రంగవల్లి పోటీలకు 98484 60013, సినీ భక్తిగీతాల పోటీలకు 80960 34302, బాలల వేషధారణ పోటీకి 98494 89206, మహిళల సరదా పోటీలకు 85238 75088 నెంబర్లలో ఈనెల 5లోగా పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

లబ్ధిదారులు త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు కేటాయించబడిన లబ్ధిదారులు సత్వరమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలని కడప తహసీల్దార్ శివరామిరెడ్డి తెలిపారు. గురువారం వైఎస్సార్ కాలనీలోని మున్సిపల్ స్కూలులో గృహ లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు లబ్ధిదారుల అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. స్థానిక సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రీజియన్ వ్యాప్తంగా దీర్ఘకాలికంగా అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి, రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, కార్యదర్శి సుధాకర్ తెలిపారు. గురువారం ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి, జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్ రెడ్డికి వినతిపత్రమిచ్చారు.

రేపటి నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : బిల్టప్ వద్దగల శ్రీ విజయదుర్గాదేవి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి నిర్వహించనున్నారు. ఇందుకోసం శుక్రవారం అంకురారోపణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం నుంచి బుధవారం వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆడపిల్లను బతికించుకుందాం

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి మగ పిల్లల నిష్పత్తి కన్నా తక్కువగా ఉండడం వల్ల సమాజ మనుగడకే ప్రమాదమని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ వి.బ్రహ్మయ్య, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో క్రిస్టియన్‌మత పెద్దలతో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి అందరం కృషి చేయాలన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కృష్ణ కిశోర్, మత పెద్దలతోపాటు జిల్లా అధికారులు సునీత రాజు, మహేశ్వరి, వినోద్‌కుమార్, విజయకుమారి పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన అవసరం

వైవీయూ : విద్యార్థులు చదువుతో పాటు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం, నోబుల్ సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎన్. వెంకట్రామిరెడ్డి , నెహ్రూ యువకేంద్రం అధికారి కె. మణికంఠ, కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, నోబుల్ సేవాసంస్థ వ్యవస్థాపకులు ఆర్. వెంకటసుబ్బయ్య, కిరణ్ గంగిరెడ్డి, ప్రేమ్‌కుమార్, స్టెప్ సిబ్బంది అబ్బాస్, నాగయ్య, పాల్గుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

– ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి



కడప ఎడ్యుకేషన్: విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కడప నగరంలోని గురుకుల పాఠశాలలతోపాటు పలు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషన్‌రెడ్డి, సెక్రటరీ విజయకుమార్‌రెడ్డి, పివి రమణారెడ్డి, ప్రైవేటు, ప్రభుత్వ ఉపాధ్యాయులు సంఘ నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం

కడప వైఎస్ఆర్ సర్కిల్: వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు చూపని నిస్సారమైన బడ్జెట్ ఇదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. గురువారం కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసే బడ్జెట్

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసే బడ్జెట్ అంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

'ఉక్కు'కు నిధులు కేటాయించకపోవడం దారుణం

జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దారుణమని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు మండిపడ్డారు. గురువారం కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

కడప రిమ్స్‌లో గుర్తు తెలియని మృతదేహాలు





కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గురువారం రెండు గుర్తు తెలియని మృతదేహాలు ఉన్నట్లు ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ మృతదేహాల ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే కడప రిమ్స్‌లో తమను సంప్రదించాలని ఆర్ఎంఓ సూచించారు.

20 మందికి కట్టుడు పళ్లసెట్లు అమరిక

– ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేఖ

కడప అర్బన్: ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో 20 మంది వృద్ధులకు కట్టుడు పళ్లసెట్లను అమర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేఖ తెలియజేశారు. ప్రపంచ ప్రోస్థోడాంటిస్ట్‌డేను పురస్కరించుకుని కట్టుడు పళ్ల విభాగంలో పది రోజుల నుంచి దంతవైద్య విద్యార్థులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు గురువారం ముగింపు కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేఖ, హెచ్‌ఓడి డి. సుధామాధురి, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, యుజీ విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు



ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, డాక్టర్లు